క్లుప్తంగా

పెళ్లి కానుక అందజేత

మొయినాబాద్: ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లుగానే స్థానిక నాయకులు గ్రామాల్లో సైతం కొత్త కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తమ సొంత పథకాలను అమలు చేస్తున్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రత్నం ఇటీవల 'పెళ్లి కానుక' పథకానికి శ్రీకారం చుట్టి ఆడపడుచుల వివాహానికి రూ.10,116లు కానుకగా అందజేస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఈదు కొళ్ల జంగయ్య కూతురు మాధవి వివాహం బుధవారం జరగడంతో ఆమె వివాహానికి మాజీ సర్పంచ్ రత్నం హాజరై రూ.10,116 పెళ్లి కానుక అందజేసి వధూవరులను ఆశీర్వదించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడాకారులకు డ్రెస్‌లు అందజేస్తున్న యాదయ్య

మొయినాబాద్‌రూరల్: యువత అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అంబేడ్కర్ కన్‌స్ట్రక్షన్ సంఘం మండల చైర్మన్ మాల యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో యాదయ్య డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్య, ఉద్యోగంతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. క్రీడలు శారీరక ధారుడ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రికెట్ ఆర్గనైజేషన్ సభ్యుడు నవీన్ ఆధ్వర్యంలో 18 మంది క్రీడాకారులకు మాల యాదయ్య డ్రెస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలకు ప్రాధాన్యం



ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందిస్తున్న పాస్టర్లు

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అన్ని పండుగలకు ప్రాధాన్యతనిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫాతిమా మాత(చర్చి) పుణ్యక్షేత్రం వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులకు పాస్టర్లు ఆశీర్వచనలు అందజేశారు. నిత్య ప్రార్థనలు, ఆధ్యాత్మికత అలవర్చుకుంటే శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని వివరించారు. అంతేకాకుండా ఆపదలో ఉన్నవారికి సాయం చేసే గుణాన్ని అలవార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్డినల్ పూల అంథోని, నల్లగొండ బిషప్ దమన్‌కుమార్, చర్చి పాస్టర్ సైమన్‌రెడ్డి, కౌన్సిల్ మెంబర్లు దిలిప్‌రెడ్డి, మర్రెడ్డి, వినయ్‌రెడ్డి, చార్లెస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, యాగారెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యానికి మించి రవాణా



కొందుర్గు నుంచి కంకర తరలిస్తున్న టిప్పర్

కొందుర్గు: టిప్పర్లలో పరిమితికి మించి కంకర తరలించడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ల నిండుగా కంకర తీసుకెళ్లడంతో రోడ్డుపై పడుతుందని వాపోతున్నారు. టిప్పర్ సమీపంలో వెళ్లే కార్లు తదితర వాహనాలపై కంకర పడటంతో వాహనాల అద్దాలు పగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై కంకరపడితే గాయపడే ప్రమాదముందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

- జీపీల్లో అందుబాటులో ఉండని అధికారులు
- విధులకు డుమ్మాకొడుతున్న పంచాయతీ సెక్రటరీలు
- అధ్వానంగా మురుగునీటి కాల్వలు
- సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు



తాళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం



షాబాద్‌లో పైప్‌లైన్ లీకేజీతో కలుషితమవుతున్న మిషన్ భగీరథ నీరు



కంపుకొడుతున్న మురుగునీటి గుంత

షాబాద్: పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీలు అప్పగించడం, వారు గ్రామాల్లో చుట్టపు చూపుగా పర్యటిస్తుండడంతో రోజురోజుకు సమస్యలు పెరుగుతున్నాయి. మంచినీటి వసతి, చేతిపంపులు మరమ్మతులకు నోచుకోకపోవడం, మిషన్ భగీరథ లీకేజీలు, పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు సతమతమవుతున్నారు.

విధులకు డుమ్మా..

జిల్లా వ్యాప్తంగా 508 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి చివరి వరకు పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో అధికారికి మూడు నాలుగు పంచాయతీల్లో రోజూవారీగా పర్యవేక్షించడం సాధ్యం కావడం లేదు. కనీసం వారానికి ఒకసారైనా పర్యటించలేకపోతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల జాడేలేదు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కూడా విధులకు డుమ్మా కొడుతున్నారు. కొంతమంది వారానికి ఒకరోజు మాత్రమే హాజరవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శులపై అజమాయిషీ లేకపోవడమే అందుకు కారణంగా పేర్కొంటున్నారు. పాలకవర్గం ఉన్నప్పుడు సక్రమంగా విధులకు హాజరయ్యే అధికారులు ఇప్పుడు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ..

ఆయా పంచాయతీల్లో మురుగునీటి కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడమే ముఖ్య కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురికి కాల్వల్లో చెత్తాచెందారం పేరుకుపోయి దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరలించడానికి ఖరీదు చేసిన ట్రాక్టర్లు వారానికి రెండురోజుల మాత్రమే షెడ్ నుంచి బయటకు వస్తున్నాయని చెబుతున్నారు. దోమల వ్యాప్తితో రాత్రీపగలు కంటి మీద కునుకు లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు.

అంధకారంలో గ్రామాలు..

కొన్ని గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. రాత్రి వేళ గ్రామం అంధకారంలో కూరుకుపోతోందని, చీకట్లో బయటకు వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. విష పురుగుల నుంచి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలు గడుస్తున్నా..

ప్రత్యేక అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. బాధ్యతలు చేపట్టి రెండునెలల గడుస్తున్నా గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ ఎవరో తెలియ దుస్థితి నెలకొంది. అయితే జీపీ కార్యదర్శుల వద్దకు సమస్యను తీసుకెళ్లినా వారు మాత్రం ప్రత్యేక అధికారుల పేరు చెబుతూ తప్పుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక అధికారుల విషయంపై ఎంపీడీఓ అపర్ణను వివరణ కోరగా.. అందరూ ఎన్నికల డ్యూటీలో ఉండడంతో గ్రామాల్లో పర్యటించలేకపోయాం. ఇప్పటినుంచి పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తారు. త్వరలోనే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తాం. అందుబాటులో లేని అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ పనుల్లో వేగం పెంచాలి



ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో ఏర్పాటు చేస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. చేగూరులో నిర్మాణంలో ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని, కొన్ని పనులకు సంబంధించి స్థానికుల నుంచి మెటీరియల్ తీసుకొని డబ్బులు కూడా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసినట్లయితే నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.

నర్సప్పగూడకు 24 గంటల విద్యుత్..

నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న నర్సప్పగూడకు 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దీంతో నందిగామ, కొత్తూరు ఫీడర్‌కు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి చేగూరు ఫీడర్‌కు విద్యుత్ కనెక్షన్‌ను కలపాలని అందుకుగాను అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దీంతో నర్సప్పగూడకు త్వరలో 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, ఏడీఏ రవీందర్, నందిగామ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, రవీందర్, వీరేందర్‌గౌడ్, బుచ్చయ్య, శ్రీశైలం, బాల్‌రాజ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళి ఎలా ఉంది

ఆమనగల్లు బీఆర్‌ఎస్ నాయకులతో ఆర్‌ఎస్‌పీ చిట్‌చాట్



బీఆర్‌ఎస్ నాయకులతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డా.ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆ పార్టీ నేతలు కలిశారు. కొన్ని నెలలుగా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు అచ్చంపేట వెళ్తూ ఆమనగల్లు పట్టణంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో ఆర్‌ఎస్‌పీ కాసేపు ముచ్చటించారు. మండలంలో పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో తన కోసం పనిచేసిన నాయకులను ఆర్‌ఎస్‌పీ అభినందించారు. కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కుమార్, స్థానిక నాయకులు వెంకటేశ్, రమేశ్‌నాయక్, జగన్, సతీశ్, రమేశ్‌నాయక్, గణేశ్, ఆనంద్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆర్లకుంట తండాలో నేనావత్ లక్ష్మణ్‌నాయక్(63) బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేమ్‌లాల్, ఎస్ఎస్‌యూవి మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ సర్పంచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కొందుర్గు: కొందుర్గు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2003–04 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సరదాగా గడిపారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తి, ఉద్యోగాల గురించి ఒకరికొకరు తెలుసుకున్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్‌రూరల్: పదో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నీల సిరివర్ష అనే విద్యార్థి 479 మార్కులతో 95.8శాతం సాధించి టౌన్ టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా హనితేజ 94శాతం మార్కులు, అభినవ్‌రెడ్డి 92శాతం మార్కులు, ముకేశ్ 90శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పార్టీ నాయకులు

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిపై చర్చించినట్లు మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మలపల్లి వెంకట్‌రెడ్డి, కాకుమాను చిన్నయ్య, గౌని వినోద్, నర్ర పాండు, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రిన్సిపాల్ తిరుపతయ్య



తిప్పాయిగూడలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

మంచాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, మంచాల గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి మా కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారాలు అందిస్తోందని సూచించారు. ఉన్నతమైన బోధనతోనే అత్యున్నత ఫలితాలు సాధిస్తారని తెలిపారు. మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలను పరిశీలన చేసి మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించి మంచి భవిష్యత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామ కమిటీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీను, నర్సింహ, కార్యదర్శులుగా జంగయ్య, రమేశ్, కోశాధికారులుగా మాధవరెడ్డి, రవీంద్రచారి, గౌరవ అధ్యక్షుడిగా వనపర్తి కృష్ణస్వామి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, సి.శ్రీనివాసులు, సలహాదారులుగా కృష్ణయ్య, బక్కయ్య, నర్సింహ, యాదయ్య, రామచంద్రయ్య, యాదయ్య, కృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా మల్లేశ్, దర్శన్‌రెడ్డి, అనంతరెడ్డి, పరంధాములు, సోషల్ మీడియా కన్వీనర్లుగా రవీందర్, భానుప్రకాశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాములు, మహేశ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గ సభ్యులకు ప్రభాకర్‌రెడ్డి ధ్రువపత్రాలను అందజేశారు.

విద్యార్థికి అభినందన

కందుకూరు: నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన కందుకూరులోని శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఊటు ప్రేమ్‌కుమార్‌కు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ద్వారా మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆర్థికసాయం చేశారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన విద్యార్థి ఊటు ప్రేమ్‌కుమార్ పూణేలో నిర్వహించనున్న నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. బాక్సింగ్ కోచ్ మల్లేశ్ ద్వారా విషయం తెలుసుకున్న సత్తినేని వెంకట్రామిరెడ్డి బుధవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ విద్యార్థిని అభినందిస్తూ అతనికి అవసరమైన ఖర్చులను భరించడానికి కేఎల్ఆర్ ముందుకొచ్చారు. విద్యార్థి తరఫున ఆ ఈవెంట్‌కు అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబీకులు కేఎల్ఆర్‌తో పాటు జెడ్పీటీసీ జంగారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సురసాని వీరారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, ఎగ్గిడి జగదీశ్, గాదె కుమార్ పాల్గొన్నారు.



ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

నందనవనాన్ని తలపించేలా..

ఆహ్లాదంగా షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ



పచ్చదనంతో కళకళలాడుతున్న కార్యాలయ ఆవరణ



కార్యాలయంలో మామిడి చెట్టు

షాబాద్: షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి ప్రజలకు నీడతోపాటు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కార్యాలయ ఆవరణలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటారు. అప్పటి ఎంపీడీఓ పద్మావతి ప్రత్యేక శ్రద్ధ వహించి సిబ్బందితో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయించారు. దీంతో నాటిన మొక్కలన్నీ ఏపుగా పెరిగి వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కొన్ని మొక్కలు చక్కని ఫలాలను కూడా ఇస్తున్నాయి. కార్యాలయంలో గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా రెడ్డి నాటిన మామిడి మొక్క ప్రస్తుతం ప్రజలకు మామిడికాయలు అందిస్తోంది.